www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 2 ఏప్రిల్ 2025
5
ఏలూరు

'బిడ్డ పుట్టిన గంటలోనే తల్లి పాలివ్వాలి'

చింతలపూడి : సాధారణ కాన్పులో బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వాల్సి ఉంటుందని చింతలపూడి ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.నారాయణ రావు, ఏరియా హాస్పిటల్ సిఎఎస్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్.విజయలక్ష్మి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సాధారణ కాన్పు వల్ల ఆసుపత్రిలో రెండు లేదా మూడు రోజులు ఉన్నా సరిపోతాయని, అదే సిజేరియన్ కాన్పులు వల్ల ఆసుపత్రిలో వారం రోజుల వరకు ఉండవలసి వస్తుందని తెలిపారు. సాధారణ కాన్పులు వల్ల తల్లి త్వరగా కోలుకోవడం వల్ల కాన్పు జరిగిన మొదటి గంటలోనే తల్లిపాలు ఇవ్వగలిగే దానివల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డ శరీరకంగా, మానసికంగా బాగా ఎదుగుతారని తెలిపారు. సాధారణ కాన్పు వల్ల తల్లి త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఉంటారన్నారు. సిజేరియన్ ఆపరేషన్ వల్ల ఇంటువ్యాధులు, బ్లీడింగ్ మొదలగు సమస్యలు రావచ్చని తదుపరి కాన్పులలో కూడా సమస్యలు రావచ్చని అందువల్ల సాధారణ కాన్పులు సిజేరియన్ కాన్పులకంటే మంచిదని, తప్పని పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ ఆపరేషన్ చేయించుకోవాలని తెలిపారు.

- ఏలూరు జిల్లాకు విజ్జేశ్వరం నుంచి పైప్‌లైన్‌తో అధికారుల ప్రణాళిక
- పోలవరం కుడి కాల్వ నుంచి వేయాలంటున్న ప్రజాప్రతినిధులు
- ఆక్వా కాలుష్యంతో పశ్చిమలో తాగునీటి కోసం జనం ఇక్కట్లు
- ఏళ్లు గడిచినా ముందుకు సాగని తాగునీటి పథకం
- గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్న జనం
- గత ప్రభుత్వం రూ.3600 కోట్ల నుంచి రూ.1400 కోట్లకు కుదింపు

వాటర్ గ్రిడ్.. రూటెటు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజానీకానికి అత్యంత అవసరమైన తాగునీటి పథక ం(వాటర్ గ్రిడ్) రూటెటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా ఈ పథకం ముందుకు సాగకపోగా, కొత్త ప్రతిపాదనలు సైతం తెరపైకి వస్తున్న పరిస్థితి ఉంది. ఆక్వా చెరువుల కాలుష్యంతో గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతున్న ప్రజానీకానికి తాగునీరు అందించాలనే మనస్సు పాలకులకు రావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్వా చెరువుల్లోని కలుషిత నీటిని పంట కాలువల్లోకి వదలడంతో రెండు జిల్లాల్లోని డెల్టా ప్రాంతంలో తాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. దీంతో కొనుగోలు చేస్తే తప్ప ఇక్కడి ప్రజానీకానికి గొంతు తడవని పరిస్థితి ఏర్పడింది. 2014 ఎన్నికల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, ప్రతి ఇంటికీ 20 లీటర్ల తాగునీరు ఉచితంగా అందిస్తామని టిడిపి చెప్పింది. గెలిచిన తర్వాత తాగునీటి గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. జనం నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఎన్‌టిఆర్ సుజల ప్రవంతి పథకాన్ని తీసుకొచ్చింది. పలుచోట్ల అప్పటికే గ్రామాల్లో ఉన్న వాటర్‌ప్లాంట్లకు సుజల ప్రవంతి బోర్డులు తగిలించి మసిపూసి మారేడు కాయ చేయాలని ప్రయత్నించారు. ప్రజల నుంచి విమర్శలు రావడంతో అప్పటి టిడిపి ప్రభుత్వం మధ్యలోనే వదిలేసింది. 2019 ఎన్నికల ముందు జిల్లాలో జరిగిన పాదయాత్ర సమయంలో వైసిపి అధ్యక్షుడు జగన్ వాటర్ బాటిల్‌లో తాగునీటిని చూపిస్తూ ఈ నీళ్లు మనుషులు ఎవరైనా తాగుతారా అంటూ టిడిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వైసిపి అధికారంలోకి వచ్చాక గోదావరి నుంచి పైపులైన్ ద్వారా తాగునీటి సరఫరా కోసం వాటర్ గ్రిడ్ పథకాన్ని తెరపైకి తెచ్చింది. తొలుత పెద్దఎత్తున హడావుడి చేసిన వైసిపి సర్కార్ తర్వాత ఆ పథకాన్ని పూర్తిగా అటకెక్కించింది.

తాగునీటి పథకం పట్టాలెక్కేదెప్పుడో..!

గోదావరిపై ధవళేశ్వరం, విజ్జేశ్వరం, అరికిరేవుల, పట్టిసీమ మొత్తం ఐదుచోట్ల పంపింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా తాగునీరు ఇచ్చేలా వాటర్‌గ్రిడ్ పథకానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాగా ఉన్నప్పుడు రూపకల్పన జరిగింది. దీనికోసం రూ.3,670 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రోజులు గడిచినా ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ పథకాన్ని డెల్టా ప్రాంతానికి పరిమితం చేస్తూ రూ.1400 కోట్లకు కుదించారు. అయినప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. జిల్లాల విభజనతో ఉమ్మడి పశ్చిమ కాస్తా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలుగా విడిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఈ పథకం ద్వారా అన్ని మండలాలకు తాగునీరు అందించే ప్రతిపాదన ఉంది. ఏలూరు జిల్లాలో మాత్రం ఉంగుటూరు, దెందులూరు నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయి. ఏలూరు నగరంలో సైతం తాగునీటి సమస్య ఉంది. దీంతో వాటర్‌గ్రిడ్ ద్వారా వేసే పైప్‌లైన్ విజ్జేశ్వరం నుంచి కాకుండా దెందులూరు నియోజకవర్గంలో పోలవరం కుడికాలువ వద్ద వేసి తాగునీరు అందించాలని ఇక్కడి ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. విజ్జేశ్వరం నుంచి పైప్‌లైన్ వేయాలంటే 120 కిలోమీటర్ల దూరం ఉంటుందని, పోలవరం కుడికాల్వ నుంచి వేస్తే 15, 20 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. దీనిపై అధికారులు సరిగా ఆలోచన చేయడం లేదని ఎంఎల్‌ఎలు మండిపడుతున్నారు. దీంతో మరోసారి వాటర్‌గ్రిడ్ పథకం ప్రతిపాదన తెరపైకి చేరింది. దీంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకానికి ఉపయోగపడే వాటర్‌గ్రిడ్ పథకం పట్టాలెక్కేదెప్పుడోననే చర్చ జనాల్లో సాగుతోంది. ఎన్నికల సమయంలో వాగ్దానాలు గుప్పించడం, గెలిచిన తర్వాత మాటలతో కాలక్షేపం చేయడం పాలకులకు అలవాటుగా మారిపోయిందనే విమర్శలు విన్పిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ముందుగా వాటర్ గ్రిడ్ పథకం పూర్తి చేసి తాగునీరు అందించాలని రెండు జిల్లాల ప్రజానీకం కోరుతున్నారు.

ఉపాధి కూలీలతో కలెక్టర్ వెట్రిసెల్వి

అందరికీ ఉపాధి హామీ పనులు చూపాలి

రానున్న మూడు నెలల్లో మరో 90 లక్షల పని దినాల కల్పనే లక్ష్యం

ఉపాధి హామీ పనులను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద 2024-25లో కోటి 23 లక్షల పనిదినాలు కల్పించామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వెల్లడించారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3.77 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో కోటి 20 లక్షల పని దినాలు కల్పించాలనే లక్ష్యంగా ఇప్పటి వరకు కోటి 23 లక్షల (103 శాతం) పని దినాల లక్ష్యాన్ని సాధించామన్నారు. ఇంతవరకు 4.23 లక్షల మంది వేతనదారులకు రూ.312.57 కోట్లు వేతనాలు చెల్లించామన్నారు. రానున్న మూడు నెలల్లో మరో 90 లక్షల పని దినాలు కల్పించాలనే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. అందరికీ ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2024-25 సంవత్సరంలో రూ.206 కోట్లతో రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. భూగర్భజలాలు అభివృద్ధికిగాను ఐదు వేల ఫారంపాండ్లు తవ్వాలని నిర్ణయించామన్నారు. తమ్మిలేరులో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకు కలెక్టర్ వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని చేసిన దానికి సకాలంలో ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి, లేనిదీ ఆరా తీశారు. కూలీల హాజరు పట్టిక, పని ప్రదేశంలో తాగునీరు, నీడ తదితర మౌలిక సదుపాయాలు కల్పనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుని పని చేయించాలన్నారు. ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత ఉపాధి హామీ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, డ్వామా పీడీ కె.వెంకటసుబ్బారావు, తహశీల్దార్ శ్రీనివాసరావు, దెందులూరు నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కె.రఘురామయ్య తదితరులు ఉన్నారు.

పెన్షన్ల పంపిణీని పరిశీలించిన కలెక్టర్

ఎన్‌టిఆర్ భరోసా నెలవారీ పింఛన్ల పథకంలో భాగంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో లబ్ధిదారులకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని మంగళవారం స్వయంగా పరిశీలించారు. కొండమంచికి కలెక్టర్ చేతుల మీదుగా పెన్షన్ నగదు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి నెలా సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తున్నారా, లేదా అంటూ ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, డ్వామా పీడీ సుబ్బారావు, తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోపాలకు తావు లేకుండా రీసర్వే పూర్తి చేయాలి

ఎటువంటి లోపాలకూ తావు లేకుండా రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న రీసర్వేను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా, చిన్న తప్పులకు ఆస్కారం లేకుండా రీసర్వే పూర్తి చేయాలన్నారు. భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలొచ్చిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, తహశీల్దార్ శ్రీనివాస్, రీసర్వే డిటి నాగమణి, పంచాయతీ కార్యదర్శి సుమతి, గ్రామ, మండల సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికుల ధర్నాలు

జంగారెడ్డిగూడెంలో..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రయివేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలను ఉపసంహరించుకోవాలని, మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం కన్నా మెరుగైన చర్యలు చేపడుతుందని కార్మికులంతా భావిస్తే, గతం కంటే దారుణ పరిస్థితుల్లోకి కార్మికులను నెట్టివేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉపశమనంగా ఉన్న ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రయివేటు ఏజెన్సీలకు, కాంట్రాక్టర్లకు కట్టబెట్టడం అంటే వెట్టిచాకిరీలోకి, బానిసత్వంలోకి నెట్టేయడమేనని ఆయన విమర్శించారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రయివేటు ఏజెన్సీలను ప్రవేశపెడితే కార్మికుల జీతాలకు, పిఎఫ్, ఇఎస్ఐలకు, కనీస వేతనాలకు గ్యారెంటీ ఉండదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలని, పట్టణాల పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు, ప్రజల ఆరోగ్యం కోసం 365 రోజులు పనిచేస్తూ శాశ్వత స్వభావం కలిగిన మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఎక్స్‌గ్రేషియా పెంచుతూ, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు, ఇంజినీరింగ్ కార్మికులకు జిఒ నెం.36 ప్రకారం జీతాల పెంపు, దహన సంస్కారాల ఖర్చు రూ.20 వేలకు పెంచుతూ, గ్రాట్యూటీ చెల్లించాలనే హామీల అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవులు, డిఎ బకాయిలు చెల్లించాలని, జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని ఆయన కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా పారిశుధ్య కార్మికులతో సమానంగా జీతాలు పెంచాలని ఆయన కోరారు. పై సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక ఆందోళన చేపట్టడానికి మున్సిపల్ కార్మికులు సన్నద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఆప్కాస్ ద్వారా ఎంతోకొంత ఉపశమనం పొందుతుంటే దాని రద్దు చేసి ప్రయివేటు ఏజెన్సీలకు అప్పజెప్పడం అంటే పెనం నుంచి పొయ్యిలో పడేయటమేనని అన్నారు. మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను ఇప్పటికే ఉద్యోగులు అనే పేరుతో కనీసం సంక్షేమ పథకాలు కూడా అమలుకాకుండా మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలను వీడకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమానికి లావేటి కృష్ణారావు, అంగులూరు జాన్‌బాబు, బంగారు వెంకటేశ్వరరావు, బండి భవానీ, ఎ.రామకృష్ణ, అల్లం జ్యోతి నాయకత్వం వహించారు.

జంగారెడ్డిగూడెం: ఆప్కాస్‌ను రద్దు చేయొద్దని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్మికులు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత స్థానిక ప్రజా సంఘాల ఆఫీస్ నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నేత పసల సూర్యారావు, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు రేలంగి నాగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.బాలరాజు, కమిటీ సభ్యులు. గున్నూరు లక్ష్మణ్, వెంకటేష్, వి.రాజు, పెంటయ్య, గోయమ్మ, భూలక్ష్మి. లక్ష్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో..

చింతలపూడి: ఆప్కాస్‌ను ఎత్తివేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంటే కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ డిమాండ్ చేశారు. చింతలపూడి నగర పంచాయతీ వద్ద ఆప్కాస్‌ను కొనసాగించాలని, మున్సిపల్ కార్మికుల జీవితాలను ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దని కోరుతూ ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పావనికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు, నేత ఆర్.ధర్మారావు, యూనియన్ నాయకులు తానంకి విజయరాజు, వెలగాడి పద్మ, షేక్ సలీం, సోమయ్య, లావేటి వంశీ, బొచ్చ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రం హోమ్ సర్వే పూర్తి చేయాలి

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో 18 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు ఉండి ఆధునిక సాంకేతిక అంశాలపై అవగాహన, విద్యార్హత కలిగిన వారికి వర్క్‌ఫ్రమ్ హోం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చేపట్టిన సర్వేను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి డిఎల్‌డిఒలు, ఎంపిడిఒలు తదితరులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వే, జిఎస్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించిన వివిధ అంశాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వర్క్‌ఫ్రమ్ హోమ్ లక్ష్యాలు పూర్తి చేయని మండలాలు బుధవారం కల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో డిఎల్‌డిఒలు, ఎంపిడిఒలు క్షేత్రస్థాయిలో పర్యటించి వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వే యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జెడ్‌పి సిఇఒ భీమేశ్వరరావును కలెక్టర్ ఆదేశించారు. ఎంప్లాయీస్ మిస్సింగ్, హౌస్ ఇమేజెస్, జియో కోఆర్డినేట్స్, నాన్ రెసిడెన్సీ ఆఫ్ ఎపి, డెత్ మార్క్ సిటిజన్స్, లెదర్ ఆర్టిజల్స్ సర్వే, ఎపి సేవా సర్వీసెస్ ఛార్జీస్ పెండింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి డ్రైవ్ మోడ్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు.

నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి

ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య

మాట్లాడుతున్న ఆవులయ్య

ఏలూరు అర్బన్ : జిల్లాలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య తెలిపారు. మంగళవారం స్థానిక న్యూ అశోక్ నగర్‌లోని ఎక్సైజ్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మార్చి ఆరవ తేదీన నవోదయం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నాటు సారా తయారీ, వినియోగం, అమ్మకాలు సాగిస్తున్న 140 గ్రామాలను గుర్తించడం జరిగిందని, అందులో 'ఏ' క్యాటగిరిలో అంటే నాటు సారా తయారు చేయడంతో పాటు పక్క గ్రామాలకు రవాణా చేసే 29 గ్రామాలు, బి కేటగిరిలో అంటే తయారు చేసే 37 గ్రామాలు, సి కేటగిరీలో అంటే ఏ కేటగిరి నుంచి సారా తీసుకుని విక్రయాలు సాగించే 74 గ్రామాలు గుర్తించామని తెలిపారు. ఈ సారా నిర్మూలన కోసం 123 గ్రామ కమిటీలు ఏర్పాటు చేసినట్లు, అందులో తహశీల్దార్, ఎంపిడిఒ, సిఐ, సర్పంచి, విఆర్ఒ, డ్వాక్రా లీడర్, విలేజ్ మహిళా పోలీస్‌లను సభ్యులుగా చేసినట్లు తెలిపారు. 120 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు, ఇందుకోసం కళాజాతాలు, మూడు ప్రచార రథాలు వినియోగించినట్లు, నాటు సారా తయారీ, వినియోగం, అమ్మకం వల్ల కలిగే అనర్థాలను ప్రజల్లోకి తీసుకెళ్లినట్లు తెలిపారు. 737 మంది పాత ముద్దాయిలపై కేసులు నమోదు చేసి 731 మందిని తహశీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు, 41 మంది బెల్లం సప్లైదారులను గుర్తించి వారితో సమావేశం ఏర్పాటు చేసి నాటుసారా తయారీదారులకు బెల్లం సప్లై చేయవద్దని ఆదేశించినట్లు, 21 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రతి 15 రోజులకు ఎవరెవరికి సప్లై చేస్తున్నారో రిపోర్టు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా బెల్లపు ఊట తయారీదారులు 67 మందిపై కేసులు పెట్టి 50 మందిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించడం జరిగిందని, మొత్తం నవోదయం కార్యక్రమంలో 479 కేసులు నమోదు చేసి, 465 మందిని అరెస్టు చేసి, 45 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే 4,175 లీటర్ల సారాయి, లక్ష 79 వేల 980 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 31 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దినట్లు మరో 66 గ్రామాలలో ఇంచుమించు సారా నిర్మూలించినట్లు, త్వరలో వాటిని కూడా సారారహిత గ్రామాలుగా ప్రకటించనున్నట్లు తెలిపారు. మండల కమిటీలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీకి జిల్లాలో పూర్తిగా సారా నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్నట్లు, సారా తయారీ, అమ్మకందారులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించనున్నట్లు ఆయన తెలిపారు.

1 నే పింఛన్ల పంపిణీ ఘనత టిడిపిదే

ఎంఎల్‌ఎ బడేటి చంటి



ఏలూరు సిటీ: పింఛన్ అందజేస్తున్న ఎంఎల్‌ఎ చంటి, నేతలు

ఏలూరు సిటీ : ఆర్థిక సంక్షోభాలెన్ని ఎదురైనా క్రమం తప్పకుండా ప్రతినెలా 1వ తేదీనే సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తోన్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. గత వైసిపి పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా తొలగించిన 99 వేల మంది లబ్ధిదారులకు తొలివిడతగా తిరిగి పెన్షన్లను పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. ఏలూరు 19వ డివిజన్ ఎన్‌టిఆర్ కాలనీలో మంగళవారం ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు చేపడతానంటూ వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ దుర్మార్గ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల 11 వేల మంది అర్హుల పెన్షన్లను తొలగించినట్లు గుర్తించామన్నారు. తిరిగి వారందరికీ పెన్షన్లు పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టామని, దానిలో భాగంగానే తొలి విడతగా మే 1వ తేదీన రాష్ట్రంలోని 99 వేల మంది అర్హులకు పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతినెలా సామాజిక పెన్షన్లు పంపిణీ చేస్తోందని స్పష్టం చేశారు. దశలవారీగా ప్రజా సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. తొలుత మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కమిషనర్ ఎ.భానుప్రతాప్, పిఒ బి.మహాలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు. **జీలుగుమిల్లి :** మండల వ్యాప్తంగా 4,232 పెన్షన్లకు గాను 3,954 ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌లను సచివాలయ సిబ్బందితో మంగళవారం పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. పెన్షన్ల పంపిణీలో పలుచోట్ల కొంతసేపు సర్వర్ సమస్య ఇబ్బంది పెట్టినా సిబ్బంది పంపిణీ ఆపలేదని తెలిపారు. మండలం మొత్తం మీద 93.5 శాతం వరకు పెన్షన్ల ప్రక్రియ పూర్తయినట్లు ఆయన తెలిపారు. **కలిదిండి :** స్థానిక కోట కలిదిండిలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు పాల్గొన్నారు. మండలంలోని మట్టగుంటలో నూతనంగా మంజూరైన వితంతు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు సిటీ : వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తగా ఉంటే అధిక వేడి వల్ల ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని తీవ్రమైన వడదెబ్బ ప్రాణాపాయమని ఏలూరు పట్టణ ఆరోగ్య కేంద్రం ఎఎస్ కాలనీ వైద్యాధికారిణి డిఆర్.నవ్య ప్రజలకు సూచించారు. స్థానిక యుపిహెచ్‌సి ఎఎస్ కాలనీలో ప్రజలకు మంగళవారం అవగాహన కల్పిస్తూ అధిక వేడి వల్ల మన శరీరంలో ఉండే నీరు చెమట రూపంలో బయటికి పోవడం వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, తీవ్రమైన వడదెబ్బ వల్ల శరీర ఉష్ణోగ్రత పెరగడం, తీవ్రమైన జ్వరం, డీహైడ్రేషన్‌కు గురవ్వడం, వాంతులు అవ్వడం, ఆయాసపడి నీరసించిపోవడం, ఫిట్స్, మొదలైన లక్షణాలు ఉంటాయని తెలిపారు. కూల్ డ్రింక్స్, కూలింగ్ వాటర్, రోడ్డు పక్క విక్రయించే రంగు ద్రవాలు తాగరాదని, వీలైనంత వరకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఒఆర్‌ఎస్ ద్రావణం, మంచినీరు తీసుకోవడం, లేత రంగు కాటన్ దుస్తులు ధరించడం, తలకు తలపాగా, టోపీ, గొడుగు వాడడం చేయాలన్నారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు మాట్లాడుతూ వేసవికాలంలో సాధారణ జ్వరాలు కూడా వచ్చే అవకాశం ఉందని, మనకి ఎక్కువగా హాని చేసే మలేరియా, డెంగీ దోమలు మంచి నీటి నిల్వ ప్రాంతాలలో పెరుగుతాయి కాబట్టి వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే ఆచరించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు, ఎల్‌టి.మాధురి, ఎఎన్‌ఎం కోమలి, ఫార్మసిస్ట్ ప్రియాంక పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎచే సీసీ, బిటి రోడ్లు ప్రారంభం

నాచుగుంటలో సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

ఉంగుటూరు : మండలంలో రూ.కోటి 93 లక్షలతో నిర్మించిన సిమెంటు, తారు రహదారులను ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు మంగళవారం ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నుంచి ఈ రహదారులను నిర్మించారు. నాచుగుంట రూ.24 లక్షలు, నీలాద్రిపురం రూ.10 లక్షలు, ఉప్పాకపాడు రూ.1.10 కోట్లు, ఎ.గోకవరం రూ.13 లక్షలు, ఎర్రమిల్లిపాడు రూ.17.50 లక్షలు, కంసాల గుంట రూ.13 లక్షలు, నల్లమా డు రూ.5 లక్షలు మొత్తం రూ.కోటి 93 లక్షలు వెచ్చిం చారు. కార్యక్రమాల్లో ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, సర్పంచులు ఏలేటి సునీత, కూటమి నాయకులు పాతూరి విజయ్‌కుమార్, ఇమ్మని గంగాధర్, కడియాల రవిశంకర్, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

ప్రజాశక్తి - కుక్కునూరు

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిరసన తెలుపుతూ మతోన్మాదం నశించాలని మండల కేంద్రంలో కుక్కునూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీలో క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని దైవ సేవకులు, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీలో భాగంగా మండల కేంద్రంలో ప్రపంచ శాంతి వర్ధిల్లాలని, క్రైస్తవులకు భద్రత కల్పించాలని, పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని, ప్రపంచశాంతి వర్ధిల్లాలని శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీలో పాస్టర్స్ ఫెలోషిప్ మండల ఉపాధ్యక్షులు సుధాకర్, ఫెలోషిప్ గౌరవ సలహాదారు పాస్టర్ సాయిబాబు, వసంత్ కుమార్, రాజ్‌కుమార్, దానియేలు, గోపి పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

కొయ్యలగూడెం : కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రెండు, మూడు తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. బిసి, కాపు కార్పొరేషన్ లోన్ కోసం ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు బ్యాంకర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డ్, జిరాక్స్ అదేవిధంగా రేషన్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్‌కు సంబంధించిన జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. పాస్‌పోర్టు ఫోటోతో పాటు ఆధార్ నెంబర్ లింకేజ్ యాడ్ ఉన్న ఫోన్ నెంబర్ ఇంటర్వ్యూ సమయంలో ఉండాలన్నారు. రెండవ తేదీ ఉదయం పరింపూడి, గవరవరం, చొప్ప రామన్నగూడెం, మధ్యాహ్నం నుంచి మంగపతి దేవి పేట కన్నాపురం దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మూడవ తేదీ ఉదయం రామానుజపురం, వేదాంతపురం, సరిపల్లి, బయ్యన్నగూడెం, మధ్యాహ్నం నుంచి పొంగుటూరు, కన్నాయిగూడెం, రాజవరం, ఎర్రంపేట, ఈవిడిపాలెం, కనకాద్రిపురం, కుంతలగూడెం గ్రామాల వారికి నిర్వహిస్తామన్నారు.

మధుసూదన్ రాజు ఫౌండేషన్ అభినందనీయం

భీమడోలు : గ్రామ పరిధిలోని పేదలకు ప్రతినెల బియ్యంతో పాటు పౌష్టికాహారం అందజేస్తున్న గుండుగొలను శ్రీమధువలేటి మధుసూదన్ రాజు ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎంపిడిఒ పద్మావతి దేవి అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు బియ్యం పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. ఫౌండేషన్ సభ్యులు సోమరాజుతోపాటు ఎంపిడిఒ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఫౌండేషన్ చాలా సంవత్సరాల వారిగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలలో భాగంగా పేదలకు ప్రతినెలా నిత్యవసరాలు పంపిణీ చేయడంతో పాటు, ఇతర కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. ఇదే క్రమంలో తాజాగా ప్రతి నెల బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారుల్లో ఎవరైనా చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకునే క్రమంలో రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేయడం ఇతరులకు ఆదర్శప్రాయం అన్నారు. ఈ కార్యక్రమాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించడం తనకు ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. ఇదే క్రమంలో పలువురు వక్తలు ఫౌండేషన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రముఖులు కొండా గంగరాజు కుమార్, జి.కృష్ణమూర్తి, మాజీ ఎంపిపి కొండలరావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

బెటాలియన్ సీనియర్ బెస్ట్ క్యాడెట్‌గా షణ్ముఖ సత్య

భీమడోలు : భీమడోలు శ్రీ వెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బి.షణ్ముఖ సత్య 2024–25 సంవత్సరానికి గాను 19(ఎ) బెటాలియన్ ఎన్‌సిసి ఏలూరు యూనిట్ బెస్ట్ సీనియర్ క్యాడెట్‌గా ఎన్నికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ తెలిపారు. 19(ఎ) బెటాలియన్ పరిధిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలు వస్తాయన్నారు. ఈమేరకు సంబంధిత పత్రాలను కళాశాలలో ఎన్‌సిసి కమాండ్ అధికారి అనిల్ పాండే చేతుల మీదుగా షణ్ముఖ సత్య స్వీకరించారు. కళాశాలకు చెందిన ఎన్‌సిసి విభాగం కెప్టెన్ శివ శంకర్ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు ఇంటింటికీ పంపిణీ చేయాలి

ముసునూరు : పౌరసరఫరాల శాఖ ద్వారా అందించే రేషన్ సరుకులు ఇంటింటికీ వెళ్లి అందజేయాలని రేషన్ వాహనదారులకు మండల రెవెన్యూ తహశీల్దార్ కె.రాజ్ కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని ముసునూరు, చెక్కపల్లి గ్రామాల్లోని రేషన్ వాహనదారులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌర సరఫరాల శాఖల ద్వారా అందించే బియ్యం, నిత్యావసర సరుకులు ఇంటింటికీ వెళ్లి అందించాలని ఆదేశించారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

జీలుగుమిల్లి : మండలంలోని బర్రింకలపాడులో ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో మంగళవారం 21 మందికి రూ.20.57 లక్షల విలువైన చెక్కులను బాధితులకు ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న బడుగు బలహీనవర్గాలకు చెందిన వారికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల జనసేన అధ్యక్షులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : బాధిత కుటుంబానికి ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేశారు. మండలంలోని బర్రింకలపాడు గ్రామంలో పోలవరం నియోజకవర్గం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయంలో మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన యలమంచి ప్రశాంత్‌కు గుండెకు సంబంధించిన వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.లక్ష విలువ గల ఒక చెక్కును మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ఆడపా నాగరాజు, చింతలపూడి నవీన్, వెలిది నాగబాబు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ముదినేపల్లి : మండలంలోని శ్రీహరిపురం పంచాయతీ శివారు స్తంభంచెరువులో ఉపాధి హామీ చట్టం నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వర రావు మంగళవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లింగాల భానుప్రసాద్, రెడ్డి జగన్మోహన్ రావు, మండల జనసేన అధ్యక్షులు వీరంకి వెంకయ్య పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కలిదిండి : విద్యుత్ షాక్ గురై ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మహిపాలెం పంచాయతీ పరిధి బరెంకలగురువులో చోటుచేసుకుంది. మృతుడు దండె విజయ కుమార్(45) తన ఇంటి వద్ద నీరు పట్టుకునేందుకు విద్యుత్ మోటారు ఆన్ చేసే క్రమంలో విద్యుత్ షాక్ గురై మృతిచెందాడు. మృతుడు [illegible] జీవనం సాగిస్తున్నాడు. మృతునికి కుమారుడు, కుమార్తె, భార్య ఉన్నారు. ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని సిబ్బందితో పరిశీలించి, మృతుని బంధువుల నుంచి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు.

మహిళను మోసగించిన వ్యక్తి అరెస్ట్

ముదినేపల్లి : ఓ మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొర్రగుంటపాలెం గ్రామానికి చెందిన వివాహిత మహిళను, కలిదిండి మండలం పోతుమర్రు గ్రామానికి చెందిన దండుబోయిన రామాంజనేయులు అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెను శారీరకంగా లోబరుచుకుని, మోసం చేసి తప్పించుకు తిరుగుతున్నాడని పెళ్లి చేసుకోకుండా పిరాయించిన రామాంజనేయులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఎస్ఐ వీరభద్రరావు రామాంజనేయులును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

దేవపుడిలో వ్యక్తిపై దాడి

ముదినేపల్లి : పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై భార్యభర్తలు దాడి చేసిన సంఘటన మండలంలోని దేవపూడి గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వాకా వెంకటేశ్వరరావుకు అదే గ్రామానికి చెందిన ఆలపాటి మణి జయకర్ రావు, అతని భార్య గొడవ పెట్టుకుని కర్రతో వెంకటేశ్వరరావు పై దాడి చేశారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో వెంకటేశ్వరరావు [illegible] మనసులో పెట్టుకుని మణి జయకరరావు దంపతులు గొడవ పెట్టుకుని దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.

పది మందిపై బైండోవర్

నూజివీడు టౌన్ : ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో పదిమంది పాత నేరస్తులను నూజివీడు తహశీల్దార్ వారి ఎదుట హాజరు పరచి వారిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎ.మస్తానయ్య తెలిపారు. అనంతరం సిద్ధార్థ నగర్ తండాకు చెందిన బలోత్ కోటేశ్వర రావు తండ్రి వెంకటేశ్వర రావు, ఒగిరాలతండ గ్రామానికి చెందిన మూడు కృష్ణ తండ్రి గాంధీ అను ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం నూజివీడు కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తికి అస్వస్థత

జీలుగుమిల్లి : పాము కాటుతో వ్యక్తి అస్వస్థత చెందిన ఘటన మండలంలోని పి.అంకంపాలెం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఊకా మోహన్ అనే వ్యక్తి పొలంలో పనిచేస్తుండగా పాము కాటు వేయడంతో అస్వస్థత గురయ్యాడు. వెంటనే పక్కనే ఉన్న మిత్రుడు అతన్ని బైక్‌పై చికిత్స నిమిత్తం కామయ్యపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ కార్యక్రమాలను కార్మికులకు తక్షణమే అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సిహెచ్ పోతేపల్లి ద్వారకాతిరుమల గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికుల జనరల్ బాడీ సమావేశాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు జగన్మోహన్ రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించి, సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం వచ్చి 9 నెలలు దాటిన సంక్షేమ బోర్డును ఎందుకు పునరుద్ధరణ చేయలేదని, వాడుకున్న డబ్బులను ఎందుకు జమ చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి ఏమాత్రం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉన్నా వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పథకాలను తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులను సమీకరించి ఆందోళన చేయవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు మధు ప్రతాప్, బండారి శివాజీ, ఆదికృష్ణ పాల్గొన్నారు.

నిడమర్రు : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసి, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. మంగళవారం పెదనింద్రకొలను వినాయక గుడి ఆవరణలో చినిమిల్లి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా నిర్మాణ కార్మికులను నమ్మించి దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కుటుంబాల ఓట్లతో అధికారంలోకి వచ్చి కార్మికులు సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని వాపోయారు. గత ఎన్నికలలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన టిడిపి ప్రభుత్వం నేడు నోరు మెదపడం లేదని విమర్శించారు. ఈనెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణ కార్మికులతో అన్ని జిల్లాలలో లేబర్ డిపార్ట్మెంటు కార్యాలయాలు ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెరుకుల శ్రీను, ఎం.సుందరం, మార్కండే రాజు, రామకృష్ణ, సోడాబత్తుల వాసు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా రవికుమార్ బాధ్యతలు

ఉంగుటూరు : ఉంగుటూరు తహశీల్దార్‌గా పాలపర్తి రవికుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తహశీల్దార్ల బదిలీ అనంతరం నుంచి నేటి వరకూ ఇన్ తహశీల్దార్‌లతోనే ఇంతకాలం నెట్టికొస్తున్నారు. ఈక్రమంలో అమరావతి సచివాలయంలో మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో సెక్షన్ అధికారిగా పనిచేస్తున్న రవికుమార్‌ను రెండేళ్ల పాటు శిక్షణలో భాగంగా పూర్తి స్థాయి తహశీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వు ఇచ్చిన క్రమంలో ఈయన ఉంగుటూరు తహశీల్దార్‌గా వచ్చారు. ఇన్‌ఛార్జి తహశీల్దారు వై.పూర్ణచంద్రప్రసాద్, ఎన్నికల డీటీ పోతురాజు, సిఎస్ టిడి స్వర్ణకుమారి, ఆర్ఐ దావీదురాజు, విఆర్ఒలు, విఆర్ఎలు, రేషన్ దుకాణం డీలర్లు, కార్యాలయం సిబ్బంది మర్యాదపూర్వకంగా రవికుమార్‌కు పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ భూసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న తహశీల్దార్

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్

ఆగిరిపల్లి : ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రతి సంవత్సరం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి మండల తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ అన్నారు. ఇండియన్ యాక్ట్స్ అవేర్‌నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్, మన హక్కులకై పోరాడు సాధించు ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆగిరిపల్లి హైస్కూల్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ తెలంగాణా రాష్ట్రం కొత్తగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రాజశేఖర్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జి.పవన్ కుమార్, ఆర్గనైజేషన్ రాష్ట్ర ఛైర్మన్ సయ్యద్ లాల్ సాహెబ్, పాతూరి రవి, నక్కనబోయిన వేణు, దొండపాటి ఏసుపాదం, బొడ్డు పుల్లయ్య, భవానీ శంకర్, కె.బాబురావు, పి.పాపారావు, బి.సాంబిరెడ్డి, డి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హాస్పిటల్‌కు కూలర్ బహూకరణ

ద్వారకా తిరుమల : గోపాలపురం నియోజకవర్గం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు ఉదారత చాటుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎల్‌ఎ సొంత నిధులతో కూలర్స్‌ను వేసవి దృష్ట్యా పేషెంట్స్ కోసం బహూకరించారు. అదనపు బెడ్స్ పార్టీ సహకారంతో కార్యకర్తలు ముందుకు వచ్చి అందజేయాలని పిలుపునిచ్చారు. హాస్పటల్లో ప్రతి విభాగాన్ని ఎంఎల్‌ఎ క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీ చేశారు. హాస్పిటల్లో నిరుపయోగంగా పడి ఉన్న ల్యాబ్ టెస్టింగ్ ఎక్విప్మెంట్ పరిశీలించి ఎటువంటి ల్యాబ్ టెస్ట్‌లు ద్వారకా తిరుమల హాస్పిటల్‌లో జరగకపోవడం చాలా బాధాకరమని, అందుబాటులో పరికరాలు ఉన్న ఎందుకు ల్యాబ్ టెస్టులు నిర్వహించడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో హాస్పిటల్లోనే ల్యాబ్ టెస్టులు చేయాలని సిబ్బందికి సూచించారు.

ముగ్గురు వైద్య సిబ్బందికి మెమో

బుట్టాయగూడెం : విధులు పట్ల నిర్లక్ష్యం వహించిన దొరమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ముగ్గురు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది డాక్టర్ నందిని, మెటర్నల్ అసిస్టెంట్ సరస్వతి, సచివాలయం ఎఎన్ఎం గంగరత్నంలకు మెమోలు జారీ చేసినట్లు కోట రామచంద్రపురం, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సురేశ్ తెలిపారు. కాన్పు కోసం ఆస్పత్రికి వస్తూ, ఆటోలోనే కాన్పు అయిన మహిళకు, కాన్పు అనంతరం అందించవలసిన సేవలలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు మెమోలు జారీ చేసినట్లు డాక్టర్ సురేశ్ స్పష్టం చేశారు.

'పది' విద్యార్థులకు అవగాహన

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ఐద్వా ఎంప్లాయిస్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతి చదివిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. పది తరువాత ఏమి చేయాలి? ఏమి చదవాలి? అనే వివిధ అంశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య వక్తలు డాక్టర్ పానుగంటి శివన్నారాయణ, ఎన్ఆర్ హనుమాన్లు ప్రసంగించారు. ఐద్వా ఎంప్లాయిస్ కాలనీ కమిటీ కన్వీనర్ మద్దాలి లక్ష్మీ, కమిటీ సభ్యులు బి.శిరీష, ఎన్.శిరీష, ఆకుల పద్మావతి పాల్గొన్నారు.

ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు తెరవాలి

ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ఏలూరు అర్బన్ : ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని, ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని పలు రైతాంగ సమస్యలను చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రబీ ధాన్యం మాసూళ్ళ ప్రారంభం అయ్యాయని, మొక్కజొన్న పంట కల్లాల్లో ఉందని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని కోరారు. వేసవికాలంలో పంట వెంటనే ఆరుదలకు వస్తుందని, కాబట్టి రైతులకు గోనెసంచులు ఇచ్చి కొనుగోలు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రబీలో పెట్టుబడులు పెరిగి రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్ ధాన్యానికి ఎ గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ఏ మాత్రం రైతాంగానికి సరిపోదన్నారు. కేంద్రం మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రబీ ధాన్యం కొనుగోలు సందర్భంగా రైతులకు సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణలో మూడవ ఆయిల్ ఫెడ్ కర్మాగారానికి శంకుస్థాపన చేసినా మన రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చలనం లేకపోవడం బాధాకరమన్నారు. పైగా పెదవేగి లోని ఏకైక ఆయిల్ ఫెడ్ కర్మాగారాన్ని ప్రయివేటీకరించాలని ప్రయత్నాలు చేయడం అన్యాయమన్నారు. పక్క రాష్ట్రాన్ని చూసైనా కనీసం పెదవేగిలో ఉన్న పాత ఆయిల్ ఫెడ్ కర్మాగారం స్థానంలో కొత్త ఫ్యాక్టరీ నిర్మాణానికి నిధులు కేటాయించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు కోన శ్రీనివాసరావు, గుండపనేని సురేష్, వి.రామారావు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీల మామిడికాయ పండుగ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అలివేరు గ్రామంలో ఆదివాసీ కొండరెడ్లు పూర్వ కాలం నుంచి కూడా ఆనవాయితీగా జరుపుకునే మామిడికాయ పండుగ మంగళవారం జరుపుకున్నారు. అలివేరులో మామిడికాయ పండుగ ఊరి పినపెద్ద కరకాల సోమరాజు రెడ్డి, చర్ల బుల్లమ్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పండుగ సందర్భంగా చిన్న, పెద్ద, ఆడ, మగ అనే తేడా లేకుండా డోలు, గిలకాయలతో నృత్యాలు చేసారు. మామిడికాయ పండుగ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల వారికి తెలియజేసి వచ్చిన వారందరికీ కల్లు, మాంసం కూరాలతో భోజనాలు పెట్టారు. ఈ మామిడికాయ పండుగ జరుపుకోకుండా మామిడికాయ అనేది ముట్టుకోరు, తినరు. ఆదివాసీ కొండరెడ్లు దారి పండుగ, చింతలపండుగ, చిక్కుడు పండుగ, పప్పు పండుగలకంటే పెద్ద పండుగగా మామిడికాయ పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఉగాది సందర్భంగా ఆదివాసీ కొమ్ము, డోలు నృత్యాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తించి విఆర్ పురం మండలం, రామవరం గ్రామస్తులు ఉయిక రామకృష్ణకు ఉగాది

మామిడికాయ పండుగలో ఆదివాసీలు

పురస్కారం అందించారు. ఈ విషయంపై అలివేరు గ్రామ ఆదివాసీ కొండరెడ్లు హర్షం వ్యక్తం చేశారు. ఆదివాసీలకు డోలు, గిల్లకాయ, కొమ్ము నృత్యాలు చేస్తున్న వారందరికి డప్పు నృత్యాలు చేసే వారిలాగే పింఛన్లు అందించాలని ఈ సందర్భంగా ఆదివాసీలు కోరుకుంటున్నారు. అంతేకాకుండా ఆదివాసీ పండుగలను క్యాలెండర్లలో చేర్చాలని, స్థానికంగా ప్రభుత్వ సెలవులు ఇవ్వాలని, ఐటిడిఎల పరిధి నుంచి నిధులు కేటాయించి, ఆనవాయితీగా వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడం కోసం నిధులు అందజేయాలని ఈ పండుగ సందర్భంగా ఆదివాసీలు కోరారు. గ్రామ పెద్దలు, ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల వారు పాల్గొన్నారు.

ముగిసిన 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా నిర్వహించిన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా జీలుగుమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 265 మంది విద్యార్థులకు గాను 253 మంది హాజరవ్వగా 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బర్రింకలపాడులోని గిరిజన గురుకుల పాఠశాలలో 207 మంది విద్యార్థులకు గాను 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని, 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఇఒ–2 ఎస్.బుచ్చయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయడంతో పాటు ప్రథమ చికిత్స కోసం ఆరోగ్య సిబ్బందిని కూడా నియమించినట్లు తెలిపారు.

టి.నరసాపురం : మండలంలో పదవ తరగతి సాంఘిక శాస్త్ర పరీక్ష ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా నిర్వహించడంతో పాటు పదిపరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని మండల విద్యాశాఖాధికారి టి.రామ్మూర్తి మంగళవారం తెలిపారు. మొత్తంగా మండలంలో 476 మందికి గాను 17 మంది గైర్హాజరు కాగా 459 హాజరై 96.42 శాతం హాజరైయ్యారు.

ముసునూరు: పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో 594 మందికి గాను 580 మంది హాజరై 14 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి బివిఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ముసునూరు, గోపవరం, చెక్కపల్లి గ్రామాల్లో నిర్వహించిన పరీక్ష కేంద్రాల్లో మండల రెవెన్యూ తహశీల్దార్ కె.రాజకుమార్ పరిశీలన చేసి రిపోర్టు జిల్లా కలెక్టర్ వెటిసెల్వికు తెలియజేసినట్లు తెలిపారు.

కలిదిండి : సాంఘిక శాస్త్రం పరీక్షకు మండలంలోని ఐదు పరీక్షా కేంద్రాలలో 846 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 14 మంది గైర్హాజరు కావడంతో 832 మంది పరీక్ష రాసినట్లు ఎంఇఒ అల్లూరి రవి ప్రకాష్ తెలిపారు.

నూజివీడు టౌన్ : నూజివీడు రెవిన్యూ డివిజన్ పరిధిలో టెన్త్ క్లాస్ పబ్లిక్ పరీక్షలలో మంగళవారం 5,438 మంది విద్యార్థులకు గాను 5,289 మంది విద్యార్థులు హాజరైనట్లు డివైఇఒ సేవ్యా తెలిపారు. సోషల్ పరీక్షకు 149 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. పదవ తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించినందుకు సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పోలవరం: మండలంలో పది పరిక్షలు మంగళవారం నాటికి ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో 365 మంది విద్యార్థులకు గాను 353 మంది విద్యార్థులు హాజరయ్యారని 12 మంది విద్యార్థుల గైర్హాజరైనట్లు హెచ్ఎం విజయ రాఘవన్, చంద్రశేఖర్లు తెలిపారు.

విజ్ఞాన యాత్రలో జెడ్‌పిహెచ్ బాలికలు

నూజివీడు టౌన్ : పట్టణంలోని జెడ్‌పి హైస్కూల్ 7, 8 తరగతి విద్యార్థినిలు కోట భాను శ్రీ, పానుగంటి దక్షిత సోనాక్షిలు విజ్ఞాన యాత్రలకు వెళ్లి వచ్చినట్లు డివైఇఒ ఎం.సేవ్యా తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ గతనెల 28, 29 తేదీలలో కసింకోట, విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయాలలోని పలు ప్రయోగశాలలను సందర్శించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో నుంచి ఇద్దరు విద్యార్థినులే పాల్గొనటం జరిగిందన్నారు. యాత్ర నుంచి వచ్చిన బాలికలను అభినందించారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

ఎంఎల్‌ఏ సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఇప్పటికే రైతులు వ్యవసాయం చేసుకొనుటకు సేద్యపు నీటికుంట(ఫారం పాండ్)ను, అదేవిధంగా పశువులకు వేసవికాలంలో దాహం తీర్చడానికి నీటికుంటలను ఏర్పాటు చేస్తున్నట్టు చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్ఏ సొంగ రోషన్ కుమార్ తెలిపారు. మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులలో భాగంగా పశువుల కోసం నీటికుంటల ఏర్పాటుకు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయ కొట్టి నీటికుంటను తవ్వారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే పల్లెలకు పూర్వ వైభవాన్ని తీసుకొస్తున్నట్టు తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే విధంగా సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాధికారులు, రైతులు, టిడిపి కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమడోలు : పొలసానిపల్లి గ్రామ పరిధిలో వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్న విధంగానే, అపార పశు సంపద గల గ్రామంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నట్లు సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. గ్రామ పరిధిలో 174 ఆవులు, 3084 గేదెలు, 2369 మేకలు, 11 గొర్రెలతో పాటు ఇతర జీవులు ఉన్నాయి. గ్రామం మెట్ట ప్రాంతం కావడంతో తాగునీటి కోసం బోరు జలాలు ఆధారం. అయినప్పటికీ గ్రామస్తులకు శుద్ధి చేసిన తాగునీటిని అందజేసే క్రమంలో గోదావరి జలాలను తాగునీటిగా అందించేందుకు సర్పంచి ఆధ్వర్యంలోని గ్రామపంచాయతీ పాలక మండలి ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. ఇక పశువుల విషయానికొస్తే వేసవి నేపథ్యంలో చెరువులు ఎండిపోయాయి. ఈక్రమంలో మేతకు వచ్చే, ఇళ్లకు వెళ్లే పశువులు, మూగ జీవులు తాగునీటి కోసం ఇబ్బందులు పడటం సర్పంచి దృష్టికి వచ్చింది. దీనిపై స్పందించిన సర్పంచి విషయాన్ని ఎంఎల్ఏ పత్సమట్ల ధర్మరాజుతో పాటు, ఉపాధి హామీ భీమడోలు పిఒ, ఎంపిడిఒ పద్మావతి దేవి దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన వారిరువురు పశువుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు నీటి తొట్ల ఏర్పాటును పరిశీలించాలని పశుసంవర్ధక శాఖ అధికారులను కోరారు. దీనిపై స్పందించిన వారు మండలంలోని చెట్టున్న పాడు, పాతూరు, భోగాపురం, భీమడోలు, పొలసానిపల్లిలో రెండేసి వంతున పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణాలు అవసరం అవుతాయని నివేదిక ఇచ్చారు. దీనిపై స్పందించిన ఉపాధి హామీ పథకం భీమడోలు పిఒ ఒక్కొక్క తొట్టి నిర్మాణానికి రూ.30 వేల ఉపాధి హామీ నిధులు కేటాయించారు. దీనిపై స్పందించిన పొలసానిపల్లి గ్రామ సర్పంచి గ్రామంలో పశువులు ఎక్కువగా రాకపోకలు సాగించే రెండు కీలకమైన ప్రాంతాలలో తొట్టెల నిర్మాణానికి ముందుకు వచ్చారు. సర్పంచి తొట్టెల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శి యు.జయ రామకృష్ణ, ఉపాధి హామీ పథకం గ్రామ సహాయకులు నాగరాజులను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్దిరాజు పాల్గొన్నారు.



చింతలపూడి నీటికుంటను ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ రోషన్‌కుమార్

జీలుగుమిల్లి : వేసవి తాపం దృష్ట్యా పశువులకు నీటి కొరత లేకుండా చూడాలని పోలవరం ఎంఎల్ఏ చిర్రి బాలరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలం లోని బర్రింకలపాడు గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ పథకంలో మంజూరైన నీటి తోట్లకు ఆయన చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. మండలం వ్యాప్తంగా 6 తొట్లు మంజూరైనట్లు ఒక్కో తొట్టికి రూ.31 వేలు వెచ్చించనున్నట్లు ఎపిఒ జాన్ వెస్లీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్, వెటర్నరీ డాక్టర్ లక్ష్మీ ప్రసన్న, జాన్ వెస్లీ, అబ్బులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సౌకర్యాలపై ఆరా

ఏలూరు అర్బన్ : వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న వసతులు, రక్షణ, వైద్య సదుపాయాలపైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంగళవారం ఆయన స్థానిక వెంకటాపురంలోని ఎలీషా బ్లైండ్ హోంను సందర్శించారు. ప్రభుత్వ పరంగా రావలసిన పథకాలలో గాని, మరేఇతర సౌకర్యాలపైన సమస్య ఏర్పడినా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని, అలాగే వారి వ్యక్తిగత సమస్యలు గానీ, కుటుంబ సమస్యలు గానీ ఉన్న ఎడల ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు.

లింగేశ్వర చెరువు పార్కు ప్రారంభం

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎంఎల్ఏ సొంగా రోషన్ కుమార్ తెలిపారు. నగర పంచాయతీలో వేగి లింగేశ్వర చెరువు పార్క్‌ను ప్రారంభించారు. విద్యుత్ దీపాలంకరణతో నగర పంచాయతీకి అందం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డి.పావని పాల్గొన్నారు. సాకులతో వాయిదాలు వేసే ప్రభుత్వం కాదు 1వ తేదీనే పెన్షన్ ఇచ్చే కూటమి ప్రభుత్వమని ఎంఎల్ఏ అన్నారు. మండలంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలా సాకులు చెప్పడం లేదన్నారు. పెన్షన్ల పంపిణీకి అడ్డు లేకుండా 29వ తేదీనే పెన్షన్ల సొమ్మును ఆయా అధికారులకు అందించారని గుర్తుచేశారు. ఎఎంసి వద్ద నవోదయ 2.0 కార్యక్రమంలో అధికారులతో సమీక్షించారు. సారాని పూర్తిగా అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నోటీసు

మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ గారి కోర్టు, కానూరు, విజయవాడలో

F.A. No. 757 / 2024 in CC No. 25/2023

(తూర్పు గోదావరి జిల్లా వినియోగదారుల ఫోరమ్ రాజమహేంద్రవరం వారి ఫైలు)

బిట్వీన్:

1)డి.డివిజనల్ మేనేజర్, చోళమండలం యం.యస్. జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ & వగైరాలు. ...అప్పిలెంట్స్

మరియు

వేటుకూరి సుబ్బలక్ష్మీ, భర్త. సూర్యనారాయణ రాజు ...రెస్పాండెంట్

టు,

వేటుకూరి సుబ్బలక్ష్మీ, భర్త. సూర్యనారాయణ రాజు, విలాస గ్రామం, ఐనవిల్లి(మం), డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పైనెంబరు అప్పీలు పిటీషన్‌లో రెస్పాండెంట్ అయిన మీకు స్టేట్ కమీషన్/శ్రీకోర్టువారి ద్వారా, నోటీసు పంపినను మీకు ముట్టనందున మీకు ఈపేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా హైకోర్టు/స్టేట్‌కమీషన్ వారు ఆర్డరువేస్తూ ది.29-04-2025కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉ॥గం॥10-30ని॥లకు మీరు స్వయంగాగాని లేక మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది.29-04-2025

యస్.ఎ. ఖాదర్, B.Sc., B.L., అప్పిలెంట్స్ తరపు న్యాయవాది
కృష్ణనగర్, గుంటూరు.సెల్: 9866320410

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 58/2014

Between:

Padala Sujata ... **Plaintiff**

And

1. Karri Veereddy
2. Karri Harika reddy ... **Defendants**

To, Defendant No.2

కర్రి హారికరెడ్డి, W/o. కర్రి వీరెడ్డి Hindu, Femele, Aged about 35 years, House wife, owner of Venkata Satyanarayana, Rice Mill, K.N.Road, opp. Chakali chervu, Pentapadu, Pentapadu mandal, W.G. Dist. TPG/PJCJ.

పై నెంబరు దావా గ్రంథములో 2nd Defendant నకు శ్రీకోర్టు వారు కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను నోటీసులు పంపించినప్పటికిని తీసుకొనకుండా Avoid చేస్తున్నందున order5 Rule 20 ప్రకారం Substitute of Service ద్వారా అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డర్ వేసినందున పై నెంబరు దావా గ్రంథములో ది. 09-04-2025 **తేదిన ఉదయం 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి ఆక్షేపణలు తెలియజేయవలెను. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

A. Dasaradha Ram
Tadepalligudem — Advocate,
Dt. 01-04-2025 — Tadepalligudem, W.G.Dt
Cell: 70136 60425

In The Court Of The Pril, Civil Judge (Junior Division) Tanuku

I.A.No. 2/2024, 3/2024 & 4/2025 in O.S.No. 199/2021

Between:

Velagala Adinarayana Reddy, Proprietor Arunodaya Fertilizers & Pesticides, rep.by Authorized Manager, Velagala Mahendra Reddy ... **Petitioner/Plaintiff**

And

Ganta Kasi Visweswara Rao, (died) Proprietor Kanaka Durga Traders, Katavapadu & Others ... **Respondents/Defendants**

పిటిషనరు/వాది తరుపున వేయించిన ప్రకటన

4. Ganta Masesh
S/o late Kasi Visweswara Rao,
Kathavapadu Village,
Iragavaram Madal, TJCJC.

5. Ganta Sesi Saie Tulasi
D/o late Kasi Visweswara Rao,
Kathavapadu Village,
Iragavaram Madal, TJCJC.

యిందుమూలంగా 4వ మరియు 5వ రెస్పాండెంట్లకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు యల్.ఆర్.ఎబెట్మెంట్ మరియు డిలేకండోన్ పిటిషన్లలో కోర్టు ద్వారా మీకు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. కావున ఈ పేపరు ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోపు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరు అయ్యి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షములో పిటిషన్లు విచారించబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

గుడిమెట్ల వీరిరెడ్డి
ది.01-04-2025, — వాది తరపు అడ్వకేటు,
తణుకు — తణుకు
సెల్: 94406 07793